# ఇన్లాండ్ లెటర్ కథలు

## ఆలస్యానికి......చింతిస్తున్నాం......!!

"పోస్ట్" అన్న కేక వినబడడంతో చీరకు ఫాల్ కుట్టుకుంటున్న రాధ బయటకు పరుగెత్తుకొచ్చింది. బాగా నలిగి,, చినిగి పోవడానికి సిద్దంగా వున్న ఓ కవర్‌ని రాధ చేతిలో పెట్టి, కిర్రుమని శబ్దం చేస్తున్న సైకిల్‌పై ఎక్కి ఆ ప్రాంతం నుండి వెళ్ళిపోయాడు పోస్ట్‌మేన్.

చేతిలోని కవర్‌తో ఇంట్లోకి అడుగు పెట్టింది రాధ. 'ఎవరు వ్రాసుంటారో' అని మనసులోనే అనుకుంటూ కవర్ చింపి ఉత్తరం బయట్కకు తీసి చదవడం మొదలు పెట్టింది.

"ప్రియమైన రాధకు,

మిమ్మెల్నెలా సంబోధించాలో నాకర్థం కావడం లేదు. ప్రియమైన నఅని సంభోధించాననీ తప్పుగా అర్థం చేసుకోవద్దు.. మీరంటే నాకు చాలా ఇష్టం. మిమ్మల్ని ప్రేమిస్తున్నానని చెప్పాలని ఎన్నోసార్లు ప్రయత్నించి భయమో......బిడియమో.....మీతో చెప్పలేకపోయాను.. మీకు ఎన్నో విషయాలు చెప్పాలని......నా మనసు విప్పి మాట్లాడాలని అనుకుంటాను కానీ మీరు కనబడగానే మౌనమే నా భాషవుతుంది.

అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను.. నా మనసులోని భావాల్ని ఎలాగూ ముఖాముఖి మీతో మాట్లాడలేను. అందుకే నాలోని ప్రేమావేశాన్ని, భావోద్వేగాన్ని అక్షర రూపంలో కాగితంపై పెట్టి ఉత్తర రూపంలో మీకు పంపాలనుకున్నాను. మి గురించి వర్ణించడానికి నేను కవిని కాను! అందుకే అపురూప లావణ్యమైన మీ అందాన్ని వర్ణించలేకపోతున్నాను. నీపై నాకున్న ప్రేమ గురించి తెలియజేస్తూ వ్రాద్దామంటే.....మనసులో భావాలైతే వున్నాయి కానీ అక్షర రూపంలో పేపర్‌పై పెట్టడానికి పెన్ను కదలడం లేదు!!

ఏది ఏమైనా......'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను! మీ ప్రేమకై మరణిస్తా! మీ ప్రేమ కోసమే జీవిస్తా!! మీరు సరేనంటే పెద్దలతో మాట్లా



డించి పెళ్ళికి ముహూర్తాలు పెట్టిస్తా! ఇదే నా మొదటి ప్రేమలేఖ......ఏమైనా తప్పులుంటే క్షమించండి. మీ లెటర్ కోసమై ప్రేమతో ఎదురు చూస్తుంటాను. తప్పకుండా రిప్లయ్ వ్రాస్తారని ఆశిస్తూ.......

మీ ప్రేమా'రాధ'కుడు

లక్ష్మణ్"

ఉత్తరం చదవడం ముగియగానే....., ఉత్తరం మొదట్లో లెటర్ వ్రాసిన తేదీ వైపు చూసింది రాధ. ది.15.5.91 అని రాసి వుంది.. కానీ ఈరోజు తేదీ ది.15.5.97 తనలో తనే నవ్వుకుంది రాధ. ఇప్పుడామెకు ఇద్దరు పిల్లలు. ఈ లెటర్ రాసిన లక్ష్మణ్‌తోనే ఆమెకు వివాహం జరిగి ఐదేళ్ళయింది. సాయంత్రం శ్రీవారు ఇంటికి రాగానే ఆ ఉత్తరం అతని చేతికి అందించింది రాధ. 'ఇది నా మొదటి ప్రేమలేఖ!' అన్నాడు ఆశ్చర్యపోతూ లక్ష్మణ్. "ఏవండీ ఆరేళ్ళు లేటుగా ఈ లెటర్ అందడానికి కారణమేమిటని పోస్టల్ వాళ్ళనడిగితే ఏమంటారంటారు." అడిగింది రాధ. 'ఏమంటారు ఆలస్యానికి.....చింతిస్తున్నాం.....! అంటారు అన్నాడు. ఆ మాట విన్న రాధ,, లక్ష్మణ్ వైపు చూస్తూ ముసి ముసిగా నవ్వింది. ఆమె నవ్వుతో శ్రుతి కలిపాడు లక్ష్మణ్.

— మల్లెంశెట్టి లక్ష్మణరావు

పిడిగురాళ్ళ

## "పూర్ ఫెలో"

రాజు ఎక్కవలసిన ఖమ్మం బస్ వచ్చింది. గబగబ అందర్నినెట్టుకుంటూ బస్ ఎక్కాడు. ఒక ఖాళీ సీటు కనబడగానే, ఆక్రమించుకుని, ఉస్సురుమంటూ నిట్టూర్చాడు, దాదాపు గంటన్నర ప్రయాణం చేయాలి తను! అప్పటి వరకు బోర్ కొట్టకుండా కాస్త 'ఎంజాయ్' చేయాలి! ఓసారి చుట్టూ పరిశీలనగా చూశాడు రాజు. అతని దృష్టి తన వరసలోని ఓ సీట్లో పడింది. కళ్ళు జిగేల్‌మనిపించే 'అందాలరాశి' ఆ సీట్లో అతనికి ప్రత్యక్షమైంది! ముచ్చటైన రూపం, ముద్దుగొలిపే ఆకారం,, ఆకర్షించే సౌందర్యం......వెరసి ఆ స్త్రీ! వయసు సుమారు ఇరవై వుండవచ్చు. ఆమెతో కాస్త పరిచయం చేసుకోవాలి– దట్సాల్! అనుకున్నాడు రాజు. ఆ స్త్రీ పక్కనే మూడు నాలుగేళ్ళ వయసు గల పాపాయి కూర్చొని వుంది. రాజు ఆలోచించసాగాడు......'ఈ పాప మీకేమవుతుంది? అని అడగాలా? మీ పేరిమిటి మిస్? అని ప్రశ్నించాలా? రాజు ఆలోచనల్లో ఉండగానే బస్ రెండో స్టేజీలో ఆగింది.. వెంటనే అరటిపళ్ళ వాడు, పల్లీలు, బఠాణీలు, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ అమ్మేవారు బస్‌ను చుట్టుముట్టి గట్టిగా అరవసాగారు. రాజుకు చటుక్కున ఐడియా వచ్చింది.. వెంటనే అతను ఓ అరడజను అరటిపళ్ళు, ఓ బిస్కెట్ ప్యాకెట్, ఓ రూపాయి పల్లీలు కొన్నాడు. రెండు అరటి పళ్ళు తీసి 'హలో ప్లీజ్ టేకిట్....' అంటూ ఆమెకు ఇవ్వబోయాడు. ఆమె ఆశ్చర్యంగా చూస్తూ 'నో! థ్యాంక్స్!' అని ముక్తసరిగా జవాబిచ్చింది. 'పట్టువదలని నవిక్రమార్కునిలా' రాజు చిరునవ్వుతో పర్లేదు! తీసుకోండి మేడమ్! అన్నాడు చొరవగా అబ్బే.....వద్దండీ! అని ఈసారి కాస్త కరుగ్గా చెప్పిందామె. పోనీ పాపయికివ్వండి మేడమ్!'

ఆమె ఈసారి మరింత ఆశ్చర్యాన్ని విసుగును కనబర్చింది......మీరే ఇవ్వండి! అంది చిన్నగా రాజులో ఉత్సాహం కలిగింది. ఫర్వా లేదు....ముందుగా పాపను మంచి చేస్కుంటే– అమెగారు కాస్త దారికిరాక పోదు...... అనుకుంటూ– పాపా– ఇవి తీసుకోమ్మా అంటూ, అరటి పళ్ళను, బిస్కెట్ ప్యాకెట్‌నిచ్చాడు.. ఆమె కేసి కాస్త గర్వంగా చూశాడు రాజు. ఆమె నిర్లిప్తతగా వుండడం చూసి ఏమిటిమె? తనతో కాస్త కులాసాగా కబుర్లు చెబితే ఏమిటట? అని గొణుక్కున్నాడు రాజు. బస్ వైరాలో ఆగింది. ఆమె దిగడానికి వెళ్ళబోతోంది. పాప మాత్రం అలాగే సీట్లో కూర్చుని నిద్రలో జోగుతూంది. హలో! పాపను వదిలి వెళుతున్నారేందుకు? ఆతృతగా ప్రశ్నించాడు.. ఈసారి ఆమె రాజుకేసి జాలిగా చూస్తూ చెప్పింది. 'సీ మిస్టర్! ఈ పాప ఎవరో నాకు తెలియదు. ఈ పాపకు నాకూ ఏ సంబంధం లేదు. ముందు కూర్చున్న లేడీస్ ఇక్కడ సీట్ ఖాళీగా వుంటే కూర్చోబెట్టారు అంతే! పాపం! పాపకోసం మీరేమో కొనిపెట్టారు. అందుకని నేను మాత్రం మీకు థాంక్స్ చెప్పను! ఇక నాకోసం ఏమైనా పిచ్చిపిచ్చిగా ఊహించుకుంటే ఐయాం సారీ! ఆమె దిగి వెళ్ళిపోయింది.

తెల్లబోయి షాకై.......అలా చూస్తుండిపోయాడు.

అంగర గోపాలకృష్ణ

మండపేట